www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 4 జులై 2025

5

అన్నమయ్య

రాజీలేని పోరాటాలు యుటిఎఫ్‌కే సాధ్యం

ప్రజాశక్తి-నందలూరు

రాజీలేని సమరశీల పోరాటాలు యుటిఎఫ్‌కే సాధ్యమని నందలూరు యుటిఎఫ్ నాయకులు హరినాథ్, రమేష్, కృపానందం, సుధాకర్, శామ్యూల్ పేర్కొన్నారు. గురువారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన యుటిఎఫ్ సీని యర్ నాయకులకు సన్మాన కార్యక్ర మాన్ని స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు షేక్ రౌఫ్‌బాషా, మస్తాన్ రెడ్డి, విశ్వనాథ్, వరప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయుల సమ స్యలపై యుటిఎఫ్ రాజీలేని సమరశీల పోరాటాలను నిర్వహి స్తోందని అన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా, ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోం దని పేర్కొన్నారు. కేవలం ఉపాధ్యాయుల సమస్యలకే పరిమితం కాకుండా పలు సామాజిక కార్యక్రమాల్లో సైతం పాలుపంచు కుంటోందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, యుటి ఎఫ్ మహిళా విభాగం అధ్యక్షురాలు రజనీ, కమిటీ సభ్యులు ఇమామ్ బాషా, ఆనంద్, విజయ్ కుమార్, రెడ్డన్న, కిరణ్ బాబు, వేంకటేశ్వర గౌడ్ పాల్గొన్నారు.

సా..గుతున్న పిఎం విశ్వ'కర్మ' యోజన

- టైలర్లు, మేస్త్రీల దరఖాస్తుల తిరస్కృతి
- కడప జిల్లాకు రూ.66.94 కోట్లు
- అన్నమయ్యకు రూ.4.84 కోట్లు

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం సా...గుతోంది. ఉభయ జిల్లాల కలెక్టర్ల అధ్యక్షతన కడప, అన్నమయ్య జిల్లాల అధికార యంత్రాంగాలు లాగిన్ సమస్య కారణంగా పథకం పురోగతిని పరిశీలించడం కష్టంగా మారింది. ఎన్ని దరఖాస్తులు అందాయో, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయో, ఎందరికి అర్హత లభించిందో, ఎవరిని శిక్షణ కేంద్రాలకు పింపించాలో, ఎవరికి ఎక్కడ శిక్షణ ఇస్తున్నారో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. రాష్ట్ర కేంద్రం నుంచి అందే అస్పష్ట సమాచారం ఆధారంగా కడప, అన్నమయ్య జిల్లాల అధికార యంత్రాంగాలు చేష్టలుడిగి చూస్తూఉండి పోవాల్సిన దుస్థితి దాపురించిన నేపథ్యంలో కథనం...

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం అనేక సుడిగుండాలను ఎదుర్కొంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల్లో నెలకొన్న గందరగోళం కారణంగా ఇటువంటి పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా పరిశ్రమల సమాఖ్య మేనేజర్ కన్వీనర్ అధ్యక్షతన సాగుతోంది. కడప జిల్లా నుంచి ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పోర్టల్ 1,63,658 దరఖాస్తులను స్వీకరించింది. వీటిని రాష్ట్ర అధికార యంత్రాంగం స్టేజ్-1, స్టేజ్-2, స్టేజ్-3 దశల్లో స్క్రూటినీ చేసింది. సుదీర్ఘ వడపోతల అనంతరం 23,231 దరఖాస్తులను ఎంపిక చేసింది. న్యాక్, నయాక్ సంస్థల ఆధ్వర్యంలో ఎంపికైన వారికి శిక్షణను పూర్తి చేసింది. 20,971 దరఖాస్తులను బ్యాంకులకు పంపించింది. అనంతరం బ్యాంకింగ్ సెక్టార్ 8,103 దరఖాస్తులను అర్హులుగా నిర్ధారించింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.66.94 కోట్లతో 4,596 మందికి చేతి వృత్తుల పరికరాలను పంపిణీ చేయాలని నిర్ణయించింది. రూ.32.66 కోట్లతో 1,492 మందికి చేతివృత్తుల పనిముట్లను పంపిణీ చేసింది. అన్నమయ్య జిల్లా నుంచి 40,154 దరఖాస్తులను స్వీకరించింది. 2,617 లబ్ధిదారులకు శిక్షణ పూర్తి చేసింది. 2,151 దరఖాస్తులను బ్యాంకులకు పంపించింది. బ్యాంకర్ల పరిశీలన అనంతరం 567 దరఖాస్తులకు మాత్రమే ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.4.84 కోట్లతో 449 మందికి చేతివృత్తుల పనిముట్లను పంపిణీ చేయాలని నిర్ణయించింది. రూ.3.80 కోట్లతో 322 మందికి పనిముట్లను పంపిణీ చేయడం గమనార్హం.

రూ.మూడు లక్షలే!

కడప, అన్నమయ్య జిల్లాలోని 2,059 మంది దరఖాస్తుదారులకు బ్యాంకర్లు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఒక్కో లబ్ధిదారుకు రెండు దశల్లో రూ.మూడు లక్షల వరకు మంజూరు చేస్తోంది. మొదటి దశలో రూ.లక్ష మంజూరు చేసిన మూడు నెలల అనంతరం రెండవ దశలో రూ.రెండు లక్షల చొప్పున పనిముట్ల కల్పన పేరుతో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

50 శాతం మందికి మొండిచేయి

జిల్లాలో 1,63,658 దరఖాస్తులు అందిన సంగతి తెలిసిందే. 50 శాతం తిరస్కరణకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. మేస్త్రీ, టైలరింగ్, తదితర పలు కులాలకు సంబంధించి సుమారు 88 వేల దరఖాస్తులు, అన్నమయ్య జిల్లాలోనూ ఇటువంటి తరహా పరిస్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి వెన్నెముకగా నిలిచిన మేస్త్రీల దరఖాస్తులను తిరస్కరణకు గురయ్యాయి. దేశాభివృద్ధిలో వ్యవసాయం, పారిశ్రామిక, సేవల రంగాల అనంతరం రియల్‌ఎస్టేట్ రంగం కోట్లాది మందికి ఉపాధి కల్పన ద్వారా దేశాభివృద్ధికి చోదకశక్తిగా నిలుస్తోంది. ఇటువంటి రంగాన్ని నిరాదరించడం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది. టైలరింగ్ సహా మరో రెండు, మూడు రంగాలకు చెందిన చేతి వృత్తులను నిరాదరించడం ఏమిటనే చర్చ నడుస్తోంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతి వృత్తుల కులాలందరికీ రుణాల మంజూరులో సమాన అర్హత కల్పించాల్సిన అవసరం ఉంది.

భారీ విస్ఫోటనానికి ఉగ్రవాదుల కుట్ర

- ఉగ్రవాదుల స్థావరాలపై పోలీసుల ముమ్మర దర్యాప్తు
- నిందితుల ఇళ్లల్లో సూట్‌కేస్ బాంబులు
- డిఎస్‌పి కార్యాలయం సమీపంలో నిర్వీర్యం
- నిందితుల కుటుంబ సభ్యులపై కేసులు నమోదు
- 14 రోజుల రిమాండ్, కడప కారాగారానికి తరలింపు
- వివరాలు వెల్లడించిన కర్నూల్ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ఉగ్రవాదుల ఇళ్లల్లో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు

ప్రజాశక్తి-రాయచోటి/రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉగ్రవాదుల కార్యకలాపాలపై పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. తమిళనాడులో జరిగిన వరుస బాంబు పేలుళ్ల కేసులో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధిఖీ, మహమ్మద్ మన్సూరు అలీలను 3 రోజుల కిందట ఐబి అధికారులు అరెస్టు చేసి చెన్నైకి తీసుకెళ్లారు. ఐబి అధికారులు అరెస్టు చేసిన తర్వాత రాయచోటి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. గురువారం వారి ఇళ్లలో సోదాలు నిర్వహించి అనేక పేలుడు పదార్థాలు, బకెట్ బాంబులు, సూట్ కేస్ బాంబులు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో వారి ఇళ్లలో దొరికిన సూట్‌కేసు బాంబులను రాయచోటి డిఎస్‌పి కార్యాలయం సమీపంలో ఆక్టోపస్ బృందం పోలీసులు నిర్వీర్యం చేశారు. ఇక్కడ స్థావరాలు ఏర్పరచుకున్న ఉగ్రవాదులపై రాయచోటి పోలీసులు 2 వేర్వేరు కేసులు నమోదు చేశారు. అబూబకర్ సిద్ధిఖీ అలియాస్ అమానుల్లా ఆయన భార్య షేక్ సైరాబానుపై కేసు నమోదు చేసిన పోలీసులు ఉపా యాక్ట్, పేలుడు పదార్థాల చట్టం, ఆర్మ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. మరో కేసులో ఉగ్రవాది షేక్ మన్సూర్ అలీ ఆయన భార్య షమీంపైన ఇవే సెక్షన్లు వర్తింపజేస్తూ కేసులు నమోదు చేశారు. గురువారం ఆ ఉగ్రవాదుల భార్యలు షేక్ సైరా భాను, షేక్ షమీమ్ అరెస్ట్ చేసి రాయచోటి కోర్టులో హాజరపరచగా విచారించిన న్యాయస్థానం ఇరువురికి 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ క్రమంలో పోలీసులు ఇద్దరిని కడప కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కర్నూల్ రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, అన్నమయ్య జిల్లా ఎస్‌సి విద్యాసాగర్ నాయుడు ఉగ్రవాద నివాసంలో సోదాలు నిర్వహించడంతో భారీగా పేలుడు పదార్థాలు దొరికినట్లు వెల్లడించారు. 20 సంవత్సరాలుగా పట్టణంలో తప్పుడు పేర్లతో అబూబకర్ సిద్ధిక్ అలియాస్ అమానుల్లా, మహమ్మద్ అలీ అలియాస్ మంసూర్ పేరుతో నివసిస్తున్నారని పక్క సమాచారంతో కొత్తపల్లి, మహబూబ్‌బాషా వీధిలో ఉన్న నిందితుల ఇళ్లను శోధించామని పేర్కొన్నారు. వారి ఇళ్లల్లో భారీ మొత్తంలో విస్ఫోటక పదార్థాలు లభించాయని తెలిపారు. ఇంటిని తనిఖీ చేయడానికి వెళ్లిన పోలీసులపై నిందితుల భార్యలు సైరా భాను, షేక్ షమీం దాడికి ప్రయత్నించడంతో మహిళా పోలీసులు ప్రతిఘటించి ఉగ్రవాద ఇండ్లకు వెళ్లి విస్ఫోటక సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనపై రాయచోటి అర్బన్ పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేశామని తెలిపారు. సైరాభాను, షమీంలను అడ్డుపడినందుకు, మహిళా పోలీసులపై దాడికి ప్రయత్నించినందుకు అరెస్టు చేసి కడప సెంట్రల్ జైలుకు రిమాండ్‌కి తరలించామని తెలిపారు. వీరికి నిందితుల ఉగ్రచర్యలపై ఎంత సంబంధముందో అనే దానిపై దర్యాప్తు కొనసాగుతుందని, నిందితులపై గతంలో కేసులు నమోదై ఉన్నాయని పేర్కొన్నారు. అబూ బకర్ సిద్ధిక్‌పై తమిళనాడులోని నాగూర్, మైలాడు, చెన్నై చింతాద్రిపేట, మదురై తిరుమంగళం పోలీసుస్టేషన్లలో కేసు నమోదైనట్లు తెలిపారు. మహమ్మద్ అలీపై చెన్నై ఎగ్మోర్ పోలీసుస్టేషన్లో కేసు నమోదైందన్నారు. బాంబు అమరిక, పాంప్లెట్‌లతో కలిసి పోలీసు కమిషనర్ కార్యాలయం వద్ద బాంబు ఉంచడం వంటి కేసులు నమోదయాయన్నారు. ఈ ఇద్దరు నిందితులు 20 సంవత్సరాలుగా రాయచోటి పట్టణంలో తప్పుడు గుర్తింపులతో నివసిస్తూ స్థానికంగా వివాహాలు చేసుకొని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఉన్నారన్నారు. అన్నమయ్య జిల్లా పోలీసుల చొరవతో ఒక పెద్ద ఉగ్ర కుట్రను భగ్నం చేయడంలో ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించిన పోలీస్ సిబ్బందికి అభినందించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి వెంకటాద్రి, డిఎస్‌పిలు సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల వివరాలు వెల్లడిస్తున్న కర్నూలు రేంజ్ డిఐజి కోయప్రవీణ్

పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలి : కలెక్టర్

నారాయణరెడ్డిపల్లెలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - సంబేపల్లి (రాయచోటి)

జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉదయం 6 గంటలకే ఇంటింటి చెత్త సేకరణ పనులు చేపట్టి పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పంచాయతీ అధికారులు, పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం సంబేపల్లి మండలంలోని నారాయణరెడ్డిపల్లి గ్రామంలో చెత్త నుండి సంపద సృష్టి తయారు కేంద్రాన్ని (ఎస్‌డిబ్ల్యూపిసి) కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రోజూ ఉదయం 6 గంటల నుండే ఇంటింటి నుండి తడి చెత్త, పొడి చెత్తను విడివిడిగా సేకరించి చెత్త నుండి సంపద సృష్టి తయారు కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పారిశుధ్య తనిఖీల్లో భాగంగా నారాయణరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో ఎన్ని గృహాలు ఉన్నాయి, ఎంతమంది పారిశుధ్య సిబ్బంది పనిచేస్తున్నారు, రోజూ ఎంత చెత్త వస్తుంది, సేకరించిన చెత్తను ఎక్కడ డంప్ చేస్తున్నారు, తడి చెత్త పొడి చెత్త విడివిడిగా వేరు చేస్తున్నారా లేదా, నేడు ఎంత మంది నుంచి చెత్త సేకరించారు, గృహాల నుండి చెత్తను ఏ సమయం నుండి ఏ సమయం లోపల సేకరిస్తున్నారు, ట్రై సైకిల్ ఎన్ని ఉన్నాయని, శానిటేషన్ వర్కర్లకు జీతభత్యాలు ఎప్పటివరకు ఇచ్చారు, 15 వ ఆర్థిక సంఘం నిధులు ఎంత ఉన్నాయి సంబంధిత వివరాలను పంచాయతీ సెక్రటరీ రవీంద్రను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో 13 పల్లెలున్నాయని ప్రతిపల్లెలో వారానికి రెండు రోజులు చెత్త సేకరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్‌కు నివేదించారు. పంచాయతీలో ఉన్న నలుగురు పారిశుధ్య సిబ్బందిచే ప్రతి 250 ఇళ్లకు ఒక శానిటేషన్ వర్కర్ చొప్పున ప్రతిరోజు ఆరు గంటల నుండి 10 గంటల వరకు చెత్త సేకరిస్తారని కలెక్టర్‌కు వివరించారు. శానిటేషన్ వర్కర్లకు ఏప్రిల్ మాసం వరకు జీతాలు ఇవ్వడం జరిగిందని, 15 ఫైనాన్స్ నిధులు పంచాయతీలో లేవని పంచాయతీ సెక్రెటరీ రవీంద్రా కలెక్టర్‌కు నివేదించారు. అనంతరం నారాయణ రెడ్డి పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పొన్నేరు వాళ్ళ పల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ ప్రజలతో కలెక్టర్ ముచ్చటిస్తూ గ్రామంలో చెత్త సేకరించుటకు రోజు వస్తున్నారా, లేక వారానికి ఒకసారి వస్తున్నారా అని కలెక్టర్ ప్రశ్నించగా వారానికి రెండు సార్లు వస్తారని గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో ఇంటి పన్ను లు కడుతున్నారా, నీటి వసతి, రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యల గురించి కలెక్టర్ ఆరా తీశారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామంలో చెల్లించే పన్నుల ద్వారా వచ్చే నిధుల నుండి పంచాయతీ పరిధిలోని రోడ్లు వీధి దీపాలు, కాలువలు తదితర అభివృద్ధి పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పిఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని, విద్యుత్‌ను ఆదా చేసి తద్వారా ఆదాయాన్ని పొందాలని కలెక్టర్ తెలిపారు. ఐవిఆర్‌ఎస్ కాల్స్‌లో పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్ర, డిపిఒ రాధమ్మ, సెక్రటరీ రవీంద్ర , మండల సిబ్బంది పాల్గొన్నారు.

36 జిఒ అమలు కోసం కార్మికుల మానవహారం

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

36 జిఒను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎన్‌జిఒ కాలనీలోని వాటర్ ట్యాంక్ ఎదుట గురువారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు మానవహారంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, శంకరయ్య మాట్లాడుతూ పని గంటలు పెంచి కేవలం రూ.15 వేల వేతనం ఇస్తున్నారని, పారిశుధ్య కార్మికులతో పాటు రూ.21 వేల వేతనం ఇవ్వాలన్నారు. వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచి ఆప్కాస్ కొనసాగించాలని, లేనిచో పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచే యాలని, రక్షణ పరికరాలతో పాటు నాణ్యమైన పనిముట్లు సరఫరా చేయాలన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయకపోవడాన్ని కార్మికుల్ని దగా చేయడం కాదా అన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ఆప్కాస్ కొనసాగించి ప్రయివట్ ఏజెన్సీ లకిచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన చెందారు. నీటి కొరత నివారణకు పాలక అధికార యంత్రాంగం చర్యలు చేపట్టి ప్రజల ఆక్రోషం నుంచి కాపాడాలని తెలిపారు. మున్సిపల్ కార్మికుల ధర్నాకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు మద్దతు తెలుపుతూ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల సాధన పోరాటానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు చెన్నయ్య, రాంబాబు, దేవా, రమేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, మౌనిక, రమణ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ఎన్‌టిఆర్ వైద్య సేవ కార్డు ఉన్నవారి నుంచి నగదు తీసుకోరాదు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ఎన్‌టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ కార్డు ఉన్న రోగుల దగ్గర నుంచి ఆసుపత్రుల యాజమాన్యం వారు ఎటువంటి నగదు తీసుకోరాదని, ఎన్‌టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ ప్రోటోకాల్‌ను ట్రస్టుతో ఎంప్యానల్ అయిన ఆసుపత్రులన్నీ పక్కాగా పాటించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధ్యక్షతన ఆరోగ్యశ్రీ క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆరోగ్యశ్రీ సమన్వయకర్త లోకవర్ధన్ సమావేశాన్ని ప్రారంభించి జిల్లాలోని వివిధ ఆసుపత్రుల యాజమాన్యం వారి పైన వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్‌కు వివరించారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారి దగ్గర నుండి అమరావతి హాస్పిటల్స్ యాజమాన్యం వారు రూ. 2500 తీసుకున్నారని, బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ వారు రూ. 16 వేల రూపాయలు, దేశాయ్ హాస్పిటల్స్ తీసుకున్న నగదు తదితర అంశాలను కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుతో ఏంప్యానల్ అయిన ఆసుపత్రులన్నీ ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ పథకంలో ఆసుపత్రుల యాజమాన్యం రక్త పరీక్ష, సిటీ స్కాన్, తదితర సేవలకు ఎటువంటి నగదును తీసుకోరాదన్నారు. కీళ్ల సమస్యల గురించి వచ్చే వారిని తప్పుదారి పట్టించరాదన్నారు. రోగులను మానవతా దృక్పథంతో చూడాలని, వారికి కనీస అవసరాలు అయిన నీరు, తదితర సదుపాయాలను అందివాలన్నారు. ఆసుపత్రులలో ఉన్న కియోస్క్‌లను నూతనీకరించుకోవాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ వారు రూపొందించిన ప్రోటోకాల్ ప్రకారం డిశ్చార్జ్ అయిన వారికి అందాల్సిన సేవలను ఇవ్వాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో జిల్లాలోని వివిధ రోగుల దగ్గర నుండి అందిన ఫిర్యాదులపై సమీక్షిస్తూ ఆసుపత్రుల యాజమాన్యం వారు తీసుకున్న నగదును తిరిగి రోగులకు ఇచ్చేశారా లేదా అని అడగగా ఆసుపత్రుల యాజమాన్యం వారు ఇచ్చేశామని సమాధానం ఇచ్చారు. అనంతరం ఆసుపత్రుల యాజమాన్యం వారు తీసుకున్న నగదులో 50 శాతం జరిమానా వేస్తూ ఆదేశాలు జారీచేశారు. సమావేశంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త లోకవర్ధన్, జిల్లాలోని వివిధ ఆసుపత్రుల నిర్వాహకులు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- బాస్ ఆధ్వర్యంలో నిరసన, వామపక్షాల మద్దతు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె గ్రామీణ మండలం అంకిశెట్టిపల్లి బుద్ధుడ కొండపై కొలువై ఉన్న గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసి, తల నరికి కాళ్ల దగ్గర పెట్టిన ఉన్మాదులను పట్టుకొని కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ అంబేద్కర్ సేన (బాస్) అధినేత ఉపాసక పిటిఎం శివప్రసాద్ తీవ్రంగా హెచ్చరించారు. గురువారం న్యూ అంబేద్కర్ సర్కిల్ వద్ద బాస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు, సిపిఐ నాయకులు తోపు కృష్ణప్ప మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు బుద్ధుడి తలనరికిన ఘటనను తీవ్రంగా ఖండించారు. పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దోషులను గుర్తించి వెంటనే అరెస్టు చేయకపోతే బాస్ సంస్థతో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ బుద్ధుడికొండను మానవ వికాస కేంద్రంగా, గొప్ప ఆధ్యాత్మిక చైతన్య కేంద్రంగా రూపొందించాలన్న ఉన్నతాశయంతో, బుద్ధ అంబేద్కర్ సమాజ్ ట్రస్ట్ ఎన్నో వ్యయప్రయాసల కోర్చి బుద్ధునికొండలో ఒక్కొక్కటిగా నిర్మాణాలు చేస్తుంటే, కొందమంది ఉన్మాదులు ఒక్కొక్కటిగా ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తథాగతుని మూడు విగ్రహాలను ధ్వంసం చేశారని, ఇప్పుడు మరో విగ్రహాన్ని ధ్వంసం చేసి, తల నరికి కాళ్ల దగ్గర పెట్టి అమానుషంగా ప్రవర్తించారని తెలిపారు. రూరల్ సిఐ కళా వెంకటరమణ, డిఎస్‌పి వాట్సాప్ ద్వారా టెక్స్ట్ మెసేజ్, ఫొటోలు పంపినా స్పందించలేదని పేర్కొన్నారు. అంకిశెట్టిపల్లి మాజీ సర్పంచ్ శరత్‌రెడ్డిని, అతని అనుచరులను, అదే గ్రామంలోని బిజెపి నాయకుడు రాజన్నను, అతనికి సన్నిహితంగా ఉండే ఆర్‌ఎస్‌ఎస్ వారిని విచారిస్తే దోషులు బయట పడగలరని సూచించారు. కార్యక్రమంలో బాస్ కేంద్ర కమిటీ ప్రతినిధి కె.వి.రమణ, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్, రాష్ట్ర కోశాధికారి నీరుగట్టి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల బయన్న, స్థానిక నాయకులు జీవీ రమణ, కృష్ణ, జనార్ధన్, రెడ్డెప్ప, సింగన్న, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి : బుద్ధుడికొండలో బుద్ధుని విగ్రహాలపై పలుమార్లుగా దాడులకు పాల్పడుతున్న ముష్కరులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు డిమాండ్ చేశారు. బుద్ధుని కొండను బహుజనసేన బృందం సందర్శించి జరిగిన సంఘటనను పరిశీలన చేసి విచారం వ్యక్తం చేశారు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్ర సమస్యగా మారబోతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బహుజన సేన నాయకులు గిన్నెల మనోహర్‌రెడ్డి, రాఘవేంద్ర యాదవ్, కుమ్మ హరిబాబు, బిసి నాయకులు జయశంకర్, బురుజు శివశంకర్, మైనార్టీ నాయకులు నూర్‌ఆలాం, క్రిస్టియన్ నాయకుడు మిథున్ కుమార్, భాను ప్రకాష్, సొట్ట రెడ్డిశేఖర్, మావిళ్ళ వెంకటేష్, పలక ఆనంద్ పాల్గొన్నారు.

దోషులను పట్టుకోవాలని నిరసన దీక్ష చేస్తున్న బాస్ శ్రేణులు

శతాధిక రక్తదాతకు అమెరికా ఆహ్వానం

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని చిట్వేలికి చెందిన శతాధిక రక్తదాత డాక్టర్ దొండ్లవాగు వేణుగోపాల్‌కు అమెరికా నుంచి ఆహ్వానం అందినట్లు ఆయన తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నార్త్ అమెరికా తెలుగు సంఘం నుంచి ఈ ఆహ్వానం అందిందని పేర్కొన్నారు. 8వ అమెరికా తెలుగు సంబరాలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి సంఘం బాధ్యుల నుంచి సమాచారం అందించారని చెప్పారు. అందుకు సంబంధించిన వీసా కార్యమాల్ని పూర్తి చేసుకుని గురువారం హైదరాబాద్ బయలుదేరి వెళుతున్నానని తెలిపారు. వేణుగోపాల్ సేవలను గుర్తించి నార్త్ అమెరికా సంఘం ఆహ్వానించడం ఎంతో ఆనందంగా ఉందని స్థానిక సహచరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

'అన్నమయ్య' పునరుద్ధరణపై నిర్లక్ష్యం

- డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య ప్రాజెక్టు విషయంలో గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిపై సరికాదని డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ అన్నారు. గురువారం వరదలకు తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టును, ముంపు ప్రాంతాలను సందర్శించారు. వరద బాధితులను పరామర్శించి వారికి అందిన ప్రభుత్వ సహాయంపై ఆరా తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిన నాటి నుండి నేటి వరకు ఏ ప్రభుత్వమూ పునరుద్ధరణకు సీరియస్‌గా ఎటువంటి కార్యాచరణ వ్యూహం రూపొందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజల పట్ల తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కోస్తా జిల్లాలపై చూపిస్తున్న శ్రద్ధ రాయలసీమ జిల్లాలపై లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం రైతులకు సరైన నష్టపరిహారం అందించలేదన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో రాజంపేట నియోజకవర్గాన్ని సందర్శించినప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నమయ్య ప్రాజెక్టు పునఃనిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం గడుస్తున్నా ఆ ఊసే లేదని విమర్శించారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఇంకా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడాన్ని తప్పుపట్టారు. తక్షణం అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు చేపట్టకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజంపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పూల భాస్కర్, జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అలీఖాన్, డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్, జిల్లా నాయకులు దర్బార్‌బాషా, బాబా సర్దార్, యహియా, మస్తాన్, అమీర్ భాష, షబ్బీర్, రియాజ్, అక్బర్, ఇర్షాద్ అలీ, సుండుపల్లి మండల అధ్యక్షుడు షేక్ సలీమ్, ఇర్ఫాన్, కైఫ్, విష్ణు, మహబూబ్ బాషా, బాబా, జశ్వంత్, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

దినేష్‌రెడ్డితో మాట్లాడుతున్న శ్రీరామ్ చినబాబు

పోలంరెడ్డిని కలిసిన శ్రీరామ్ చినబాబు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో గురువారం ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పర్యటించారు. ఈ నేపథ్యంలో మదనపల్లి పట్టణానికి చెందిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చిన బాబు, రాజంపేట పార్లమెంట్ జనరల్ సెక్రటరీ దొరస్వామినాయుడు, రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. హార్సిలీహిల్స్ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చినబాబు మాట్లా డుతూ సిఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధతీ సుకుంటున్నామని అన్నారు. కాలుష్యాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం దినేష్‌రెడ్డి మాట్లాడుతూ హార్సిలీహిల్స్ అందాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని అన్నారు. ఇక్కడ వివిధ రకాల మొక్కలు, చెట్లు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయన్నారు. ఈ పర్యాటక కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలో పర్యావరణాన్ని పెంపొందించి, హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ వెల్లడించారు.

నేడు బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల సాధారణ సర్వసభ్య సమావేశం నేడే స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నందు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కృష్ణవేణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఈ సమావేశంలో చర్చించనున్నారన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని రావాలన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు.

కలకడ ఎంపిడిఒగా భానుప్రసాద్

ప్రజాశక్తి-కలకడ

బాధ్యతలు స్వీకరిస్తున్న భానుప్రసాద్

మండల కేంద్రమైన కలకడ ఎంపిడిఒగా భానుప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపిడిఒగా విధులు నిర్వహి స్తున్న అబ్దుల్‌రహీం ఉద్యోగ విరమణ పొందారు. రామ సముద్రం మండలంలో ఎంపి డిఒగా విధులు నిర్వహి స్తున్న భాను ప్రసాద్ కలకడ బదిలీపై కలకడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ప్రతి అధికారి ప్రజలకు అందు బాటులో ఉండి ప్రజా సమస్యల పట్ల దృష్టి సారించి, సమస్యలను పరిష్కరిం చేందుకు కృషి చేయాలన్నారు.

ఎస్ఆర్ఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అనంతపురం జేఎన్టీయూ ఏప్రిల్, మే 2025లో మూడవ సంవత్సరం బిటెక్ సెకండ్ సెమిస్టర్ నిర్వహించిన పరీక్షా ఫలితాలలో సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించారని ప్రిన్సిపల్ పాండురంగన్ రవి తెలిపారు. సివిల్ బ్రాంచ్ విభాగంలో పి.శుభా అఖిల్ 86.24, కె కావ్య 84.62, ఎంఎస్ మహమ్మద్ అనీఫ్ 83.12, ఇఇఇ విభాగంలో ఎన్.దేవిశ్రీ 89.68, యు జ్యోతి స్వరూప 86.45, సి భాగ్యలక్ష్మి 86.24, ఇసిఇ విభాగంలో ఎన్ శాలిని, జె దివ్య 86.67, ఎ తేజున్నిస 86.02, జి లక్ష్మి 85.59, సిఎస్ఇలో కె వెంకటసాయి జయంత్ 89.18, కె మహమ్మద్ జాఫర్ 88.63, సి త్రిపురాంబిక 88.36 శాతం మార్కులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి, హెచ్ఒడిలు, అధ్యాపకులు అభినందించారు.

ఆన్‌లైన్‌లో 'అన్నదాత సుఖీభవ' అర్హుల వివరాలు

ప్రజాశక్తి - చాపాడు

అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకానికి సంబంధించి అర్హుల వివరాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచిందని వ్యవసాయ అధికారి దేవి పద్మలత తెలిపారు. అర్హులైన వారికి ప్రభుత్వం ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20వేలు ఆర్థిక సహాయం చేస్తుందని తెలిపారు. రైతు స్థితిని తనిఖీ చేయడానికి అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో స్టేటస్ చెక్ చేసుకునే సౌకర్యం ఉందని తెలిపారు. ఒక రైతు అనర్హుడిగా గుర్తించబడి, ఇది తప్పు అని విశ్వసిస్తే, వారు పోర్టల్‌లో అందుబాటులో ఉన్న గ్రీవెన్స్ మాడ్యూల్‌ని ఉపయోగించి ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాలు, సందేహాల కోసం రైతులు టోల్ ఫ్రీ నంబర్ 155251ని సంప్రదించవచ్చని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తిప్పేస్వామి పేర్కొన్నారు. గురువారం వెంగంవారిపల్లి పంచాయతీలోని బాలి నాయునిపల్లిలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలకు పాల్పడే వ్యక్తులు ఎక్కువగా తయారయ్యారని వీరి పట్ల ప్రజలు అవగాహన కలిగి తగిన జాగ్రత్తలతో ఉండాలన్నారు. మీ బ్యాంకు అకౌంట్‌కు సంబంధించిన అకౌంట్ నెంబర్లు, ఏటిఎం కార్డు కొన్ని నెంబర్లు ఫోన్ నెంబర్లు, గుర్తు తెలియని వ్యక్తులు అడిగితే ఇవ్వకూడదని అన్నారు. బ్యాంకు ద్వారా లోన్ ఇప్పిస్తామని మీ సమాచారం తెలుసుకోవడానికి వివరాలను అడుగుతారని అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి, మోసాలకు పాల్పడే అలాంటి వారు ఎవరైనా ఫోన్ చేస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమా చారం అందివాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రోడ్డుపై నిత్యం ప్రజలు ప్రయాణికులు విద్యార్థులు ప్రయాణిస్తుంటారని తగిన జాగ్రత్తలతో రోడ్డుపై ప్రయాణించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నాటుసారా తయారు చేయడం, అమ్మడం, వంటివి చేయరాదని అలాంటి వాటిని ప్రోత్సహించిన వారిపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కోడిపందెలు, పేకాట, జూదం వంటివి వాటిపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చి చేరుతున్నా, సంచరిస్తున్న వెంటనే పోలీసులకు సమాచారం అందివాలన్నారు. చోరీలు నియంత్రించడానికి పోలీసులు రాత్రి వేళలో గస్తీలు నిర్వహిస్తున్నారని అన్నారు. కొత్త వ్యక్తుల సంచారం, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు ప్రజలు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి

పెద్దమాలపల్లిలో విజృంభిస్తున్న విషజ్వరాలు

- మంచాలకే పరిమితమైన బాధితులు
- గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వేడుకోలు

పెద్దమాలపల్లి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని అరవీడు పంచాయతీ పెద్దమాలపల్లిలో 15 కుటుంబాల దళితులు జీవిస్తున్నారు. నెల రోజులుగా ఇక్కడ విషజ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రజలు జ్వరాల బారిన పడి మంచం పడుతున్నారు. ప్రతి ఇంటిలో ఇద్దరు, ముగ్గురు చొప్పున మంచాలపై పడిపోయారు. జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు, అరికాలు మంటలు, దురద, కూర్చోలేక, నిల్చులోకే పోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పెద్ద మాలపల్లి దళితవాడను సందర్శించి గ్రామంలో పర్యటించి ఇక్కడి పరిస్థితులను పరిశీలించాలని కోరతున్నారు. జ్వరాల బిజృంభణకు పారిశుధ్య లోపమో, తాగునీరు కలుషిత మవుతున్నాయో గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యాధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు.

మంచానపడ్డ జ్వర పీడితులు

డెంగీ, మలేరియాపై అవగాహన కలిగి ఉండాలి

విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రత్యూష

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మలేరియా, డెంగ్యూ వంటి వ్యాప్తిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష పేర్కొన్నారు. గురువారం నిమ్మనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాల్మీకిపురం పిహెచ్‌సి డెంటల్ డాక్టర్ ఎం.పి. హిమబిందు, కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌తో కలసి ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించి కళాశాలలోని విద్యార్థులకు రక్త పరీక్షలను చేశారు. కళాశాలలోని 172 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్, రక్త పరీక్షలు చేసి రక్తం రకాన్ని, ఆరోగ్య స్థితిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ జాతీయ డెంగీ మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతూ దోమ కాటు వలన వచ్చే మలేరియా డెంగీ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడు వాపు వంటి జ్వరాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. డెంగీ నివారణ మన చేతుల్లోనే ఉందన్నారు. దోమలు ప్రబల కుండా ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ లను లార్వా దశలోనే నివారించాలని పేర్కొన్నారు. ఒకే చోట నీటిని నిల్వ ఉంచడం వలన దోమలు ప్రభలే అవకాశం ఉందని సూచించారు. రెండు రోజులకు మించి జ్వరం వస్తూ ఉంటే ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయిం చుకుని, సకాలంలో మందులు వాడడంతో ఆరోగ్యంగా ఉండవచ్చు అన్నారు. డెంగీ, మలేరియా వంటి జ్వరాలను నిర్లక్ష్యంగా తీసుకుంటే ప్రమాదాలను తెచ్చుకున్నట్లేనని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందే వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ రామాంజులు, మదనపల్లి సబ్ యూనిట్ ఆఫీసర్ ఖలీల్, ఆరోగ్య పర్యవేక్షకులు దేవేంద్ర, ప్రసన్న, మహేష్, ల్యాబ్ టెక్నీషియన్ ఆనంద్, ఎంఎల్‌హెచ్‌పి నిత్య మీనాక్షి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సికిల్ సెల్ అనీమియా పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రం కలికిరిలోని ఎస్‌టి కాలనీలో మెడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో ఘనంగా సికిల్ సెల్ అనీమియా పక్షోత్సవాలు నిర్వహించారు. డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, టిబి పర్య వేక్షకులు నాగిరెడ్డి సికెల్ సెల్ అనీమియా పక్షోత్సవాల ముగింపు సందర్భంగా ఎఎంసి డైరెక్టర్ శ్రీనివాసశర్మ అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిహెచ్ఇఒ మాట్లాడుతూ సికెల్ సెల్ అనీమియా రక్తపరీక్షలు 40 సంవత్సరాలోపు ఉన్నవారంతా తప్పక చేయించుకోవాలని సూచించారు. పింగాని ఫ్యాక్టరీ ప్రాంతంలో సికిల్ సెల్‌పై 2047సంవత్సరానికి సికిల్ సెల్ అనీమియా నిర్మూలన మిషన్‌లో భాగంగా అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. సికెల్ సెల్ అనీమియా వ్యాధి వారసత్వంగా వచ్చే ఎర్ర రక్తకణముల వ్యాధి అని తెలిపారు. తల్లిదండ్రుల నుంచి జన్యుపరంగా పిల్లలకు వస్తుందని, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలు రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్ళు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన వళ్ళు నొప్పులు, కీళ్ళ నొప్పులు, శ్వాస తీసుకోవడంలో కష్టం, అలసట వస్తుందని అన్నారు. తరచుగా వచ్చే అంటువ్యాధులు, గర్భ ధారణ సమయంలో సమస్యలు, అవయవ వైఫల్యం, పెరుగుదల వంటి సమస్యలు తలెత్తుతాయని అన్నారు. ఈ వ్యాధి నిర్ధారణ కొరకు ప్రతీ ఆరోగ్య కార్యకర్త దగ్గర పరీక్ష కిట్స్ అందుబాటులో ఉన్నాయని, ఒక్క చుక్క రక్తంతో పరీక్ష చేసుకోవచ్చునని సున్నా నుండి 40సంవత్సరాలలోపు గిరిజనులు పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ ఐతే హైడ్రాక్సీ యూరియా మాత్రలతో పాటు ఫోలిక్ ఆసిడ్ మాత్రలు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అవసరం ఐతే రక్తం ఎక్కించాలిసి వస్తుందని, వివాహనికి ముందు అమ్మాయి, అబ్బాయి ఇద్దరు సికిల్ సెల్ రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం సికిల్ సెల్ అనీమియా ప్రజల భాగస్వామ్యం తో ర్యాలీ నిర్వహించారు. మొత్తం 15మందికి సికిల్ సెల్ పరీక్షలు చేయడం జరిగింది. కార్యక్రమంలో ఎస్‌టిఎస్ నాగిరెడ్డి, సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సికిల్ సెల్ అనీమియాపై కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

చంద్రబాబుతోనే సుపరిపాలన : 'ముక్కా'

ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న రూపానందరెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్రంలో సుపరిపాలన ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని కుడా చైర్మన్, టిడిపి ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. కోడూరు మండలం శెట్టిగుంట పంచాయతీలోని యానాదిపల్లి, జ్యోతి కాలనీ, కుక్కలదొడ్డిలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తు న్నట్లు తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల్లో సమర్థ వంతంగా అమలు చేసేందుకు సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను సంపూర్ణంగా అమలు చేయడానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే నిరుద్యోగ యువత కొరకు డిఎస్‌సి నిర్వహించడం, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల, వితంతువులకు పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.4వేల వరకు పెంచారని అన్నారు. తల్లికి వందనం పేరుతో అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాలో నగదును జమ చేశారని అన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తారని, నిరుద్యోగ భృతి, మిగిలిన పథకాలు కూడా త్వరలోనే అందించేందుకు సిద్ధమవుతు న్నారని అన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాష్, మల్లికార్జున రెడ్డి, నీలకంఠయ్య, గడికోట సుబ్బరాయుడు, టివి రమణారెడ్డి, వేమన సుబ్రహ్మణ్యం నాయుడు, వెంకటరామరాజు, రవికుమార్‌రాజు, కల్లా చలపతి, సుబ్బిరామిరెడ్డి, ఎస్‌సి కార్పొరేషన్ సభ్యులు అనితదీప్తి, కొమ్ము శివ, పరుశురాం రెడ్డి, పోకల మణి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటరమణ, సుకుమార్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు. **మదనపల్లి:** పట్టణంలోని 6వ వార్డు పరిధిలో గొల్లపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం వార్డు ఇన్‌ఛార్జి శ్రీరా మినేని సహదేవనాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. స్థానికంగా ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనుల గురించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అర్హులైన వారికి అందుతున్నది,లేనిది వార్డు ప్రజలను అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో 6వ వార్డు నాయకులు నజీర్, రెడ్డెప్ప, ఎంవిఆర్, రమేష్, ప్రమీల, పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు యర్రబల్లి వెంకటరమణారెడ్డి, సాంస్కృత విభాగం జిల్లా నాయకులు డాన్స్ రెడ్డెన్న, మండల ఉపాధ్యక్షులు మాకినేని చంద్రశేఖర్, క్రిస్టియన్ సెల్ నాయకులు జాన్ బాబు, ఎస్‌సి సెల్ నాయకులు సూదిళ్ల సుధాకర్, నవీన్‌చౌదరి పాల్గొన్నారు.



మదనపల్లి : ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రకృతిని కాపాడుకోవడం సామాజిక బాధ్యత

మొక్కలు నాటుతున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి-నందలూరు

ప్రకృతిని కాపాడుకోవడం సామాజిక బాధ్యత అని ఎస్ఐ రామ్మోహన్ పేర్కొన్నారు. వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అరవపల్లి జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో నందలూరు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తనికంటి వెంకటనారాయణ పాల్గొని మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని భావితరాలకు ప్రకృతి ఫలితాలను అందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మన్నెం రామమోహన్ మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం ద్వారా జీవవైవిధ్యాన్ని పెంచుకోవచ్చని తద్వారా రాబోయే రోజుల్లో మానవాళి మనుగడకు మంచి చేసిన వారం అవుతామని ప్రకృతి మానవునికి ఎంతో ఇస్తుందని కావున ప్రతి ఒక్కరు మొక్కలు నాటి హరిత గ్రామం లక్ష్యంగా ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కుర్రా మణి యాదవ్, మోడపోతుల రాము, ఉప్పు శెట్టి సుధీర్, గురు ప్రసాద్, మంటి మారయ్య, సునీల్ రెడ్డి, జంగం శెట్టి హరి, హేమంత్, సుబ్బారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

జిల్లా విజన్ ప్రణాళికలకు రూపకల్పన

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, నియోజకవర్గ విజన్ ప్రణాళికల రూపకల్పనకు కమిటీలతో పటిష్టమైన సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం విజయవాడ సచివాలయం లోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా, నియోజకవర్గ విజన్ ప్రణాళికలపై సమావేశాల నిర్వహణ, సానుకూల ప్రజా అవగాహన, ఫేషియల్ రికగ్నేషన్, సౌర ప్రాజెక్టులకు సంబంధిం చిన భూసేకరణ, పీఎం సూర్య ఘర్ పథకం, ఎస్‌హెచ్‌జి బృందాలకు జీవనోపాధి వార్షిక రుణ కార్యాచరణ ప్రణాళిక, సూక్ష్మ రుణ ప్రణాళిక అమలు, రుతుపవనాల సంసిద్ధత తదితర అంశాలపై కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి ఆయా అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాయచోటి కలెక్టర్ శ్రీధర్, జెసి ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదన్‌రావు, జిల్లా అధికారులు, పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 4 నుంచి 11వ తేదీ వరకు నియోజకవర్గ, జిల్లా విజన్ ప్రణాళికల రూపకల్పనకు కమిటీలతో సమావేశాలను పటిష్టంగా నిర్వహించాల న్నారు. పీఎం సూర్య ఘర్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్స్ ఎక్కువ సంఖ్యలో నమోదు అయ్యేలా ఈ పథకంపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు.వీరితోపాటు బిసి రిజిస్ట్రేషన్ పై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలో చేపట్టే సౌర ప్రాజెక్టులకు సంబంధిం చిన భూసేకరణను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌జి బృందాలకు జీవనోపాధి వార్షిక రుణ కార్యాచరణ ప్రణాళిక, సూక్ష్మ రుణ ప్రణాళిక అమలుకు ప్రభుత్వ మార్గదర్శ కాలపై అవగాహన పెంచుకొని ఆ మేరకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. రుతుపవనాలు, ప్రకృతి వల్ల ఏర్పడే విపత్తు లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సంబంధిత శాఖలు సదా సన్నద్ధంగా ఉండాలని ఇందుకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు.జిల్లాలో అన్నా క్యాంటీన్లలో మరింత మెరుగైన నిర్వహణను అమలు చేయాలని, మునిసిపాలిటీలలో పటిష్టంగా పారిశుధ్య కార్యక్రమాలను అమలు చేయాలని, రోజువారి చెత్త సేకరణ, కాలువల పరిశుభ్రం సేవలలో మెరుగైన నిర్వహణ ఉండాలన్నారు. అలాగే మహిళలపై నేరాలు, గంజాయి, మత్తు పదార్థాలు నిర్మూలనకు పకడ్బందీగా చర్యలు చేపట్టాల న్నారు. ఆయా అంశాలలో ప్రజలకు సేవలు అందించేందుకు కృషిచేసి, ప్రజా సానుకూలతను పెంచేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. విసిలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పంటల బీమాను విడుదల చేయాలి

- వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

గతేడాదికి సంబంధించిన ఖరీఫ్, రబీ పంటల బీమాను కూటమి ప్రభుత్వం విడుదల చేయాలని వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తుకూరు మస్తాన్‌రెడ్డి కోరారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతేడాది రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ, పత్తి, కంది, మినుము సాగు చేశారన్నారు. సకాలంలో వర్షాలు రాకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండి పోయినట్లు చెప్పారు. రైతులకు చాలా నష్టం వాటిల్లిందని చెప్పారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.30వేలు పెట్టుబడి ఖర్చు వచ్చినట్లు చెప్పారు. రబీ సీజన్‌లో కూడా ఆశించినంత పంట దిగుబడి రాక రైతులు చాలా నష్టపోయారని చెప్పారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతు లకు రావాల్సిన ఖరీఫ్, రబీ పంటల బీమా, రైతు భరోసా విడుదల చేసి వారిని ఆదుకోవాలని కోరారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు శ్రీబాలశివ యోగేంద్ర మహారాజ్ డిగ్రీ కళాశాలలో గురువారం అర్బన్ ఎస్ఐ సుబ్బారావు విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలు శక్తి యాప్‌ను ఆపద సమయంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏదైనా ప్రమాదమని అనిపిస్తే రక్షణ కోసం యాప్ అప్లికేషన్‌పై క్లిక్ చేస్తే చాలు నిమిషాల్లో పోలీస్ రక్షణ అందుబాటులో ఉంటుందన్నారు. పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్-112, రహదారి భద్రత, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ జె.నాగయ్య, హెడ్ కానిస్టేబుల్ మురళి, కానిస్టేబుల్ గురివిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

8న గండి క్షేత్రంలో వేలం పాట

ప్రజాశక్తి - చక్రాయపేట :పుణ్య క్షేత్రమైన గండి శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 8న మంగళవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. గండి క్షేత్రం ఆవరణలో పూలు విక్రయం, అవతారంలో టోల్‌గేట్ వసూలు, దేవస్థానం ఆవరణలో ఉన్న షాపుల వాణిజ్య గదులు బాడుగ పాడుటకు వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిపాజిట్ చెల్లించిన హిందువులు మాత్రమే వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. వేలం దక్కించుకున్న వారు ఆలయ నిబంధనలకు లోబడి తమ కార్యకలాపాలను కొనసాగించాల్సి ఉంటుందన్నారు.

క్రైం కార్నర్

ముద్దాయిలను జైలుకు తరలిస్తున్న పోలీసులు

హత్య కేసులో ప్రేయసి, ప్రియుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

డాన్స్ ప్రోగ్రామ్‌కు అడ్డుగా ఉందని, కన్న బిడ్డను ప్రియుడితో కలసి హత్యచేసిన తల్లి, ప్రియుడికి మదనపల్లె ఎడిజె కోర్టు జడ్జి జీవిత ఖైదు విధిస్తూ గురువారం సంచలన తీర్పు వెలువరించింది. ఎపిపి జయనారాయణరెడ్డి కథనం మేరకు.. చిత్తూరు జిల్లా ఐరాల మండలం, మొరవపల్లికి చెందిన బోయకొండ భార్య శాంత, రామసముద్రం మండలం, గాజులనగరంకు చెందిన ప్రియుడు సుండుపల్లి శ్రీనివాసులుతో కలిసి డ్యాన్స్ పొగ్రామ్‌లకు వెళ్ళేదని తెలిపారు. 2017వ సంవత్సరంలో పుంగనూరు మండలం, సుగాలిమిట్ట పెద్దతండాలో డ్యాన్స్ పోగ్రామ్‌కు వెళ్లేందుకు తన కూతురు శివాని(2) అడ్డుగా ఉందని ప్రియుడు శ్రీనివాసులతో కలిసి సుగాలిమిట్ట వద్ద గొంతునులిమి హత్య చేశారని తెలిపారు. మృత దేహాన్ని ఆటోలో తీసుకొచ్చి మదనపల్లె మండలం, చెంబా కూరు రోడ్డు సందిరెడ్డిపల్లి కాలువలో పడేశారని పేర్కొన్నారు. ఈ కేసులో అప్పటి పుంగనూరు పోలీసులు నిందితులను అరెస్టు చేశారని తెలిపారు. కేసు పూర్వా పరాలను విచారించిన మదనపల్లి ఎడిజె కోర్టు నిందితులపై నేరం రుజువు కావడంతో జడ్జి జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పు చెప్పారు. ఇద్దరికి చెరో రూ.5 వేలు అపరాధరుసుం విధించారు.